# పాపి

రామదాసు తల్లి నలభై సంవత్సరాల క్రితం (అతని చిన్న తనంలోనే) సరిగ్గా ఇదే రోజున శివరాత్రినాడే చనిపోయిందట.

ఆ సంగతీ "తెలుసా?" అని అడిగాడు దాసు.

"ఎందుకు తెలీదు? ఎంత పుణ్యం చేసుకుందోగాని గొప్ప చావు కొట్టేసింది తల్లి. తిన్నగా కైలాసానికి వెళ్ళి తీరాలి" అన్నాడు దాసుగారి ముఖ్యమంత్రి.

"కేడీగాళ్ళు సెంట్రల్ జెయిల్ కెళ్ళినట్లు" అన్నాడు అతని డిప్యూటి.

"నోరుముయ్యెహ్" అంది నూకాలమ్మ.

"వీడికి – ఎపుడేమాట అనాలో తెలీదు" అన్నాడు ముఖ్యుడు డిప్యూటీ గురించి.

శివరాత్రినాడు నలుగురూ దాసుగారి మేడమీద పడగ్గదిలో తివాచీ మీద కూర్చొని పేకాటాడుతున్నారు. పన్నెండు గంటలు ఠంగ్ ఠంగ్ మన్నాయి.

"రేపీపాటికి నీలయ్యగాడు...." అని యేదో అనబోయాడు డిప్యూటి.

"ఒరే! డిప్టీ!" అని అతణ్ని గద్దించాడు ముఖ్యుడు.

"నోరు ముయ్యకపోతే ఆడితో పాటే నువ్వూనూ" అంది నూకాలమ్మ.

"తప్పు తప్పు" అని లెంపలు వేసుకున్నాడతను. అతని దగ్గిర సారా వాసన గుప్పున కొడుతోంది.

"నీలయ్య ఊసెత్తకు" అంది నూకాలమ్మ.

"పండుగపూటా ఆ పేరెందుకు?" అన్నాడు ముఖ్యమంత్రి.

రామదాసు... నీలయ్య

ఇద్దరూ ఒక్కలాటివాళ్ళే నంటారు కొంతమంది. కాని కాదు. వాళ్ళిద్దరి మధ్యా ముఖ్యమైన తేడాలున్నాయి. దాసు కొన్ని విషయాల్లో 'దేముడితో సమానం'. అతన్ని నమ్మి చెడినవారు లేరు. అతనికి ఆశ్రితజన పక్ష పాతం ఎక్కువ. ఆడినమాట అతను నిలబెట్టుకోగలడు కూడాను. నీలయ్యకి అటువంటి కీర్తి ప్రతిష్టలు లేవు. మరొక

విషయం. నీలయ్యకి ఇతరుల చావుగురించి బెదురులేదు. దాసుకసలు చావంటే భయం లేదు.

వాళ్ళిద్దరి మధ్యా పచ్చగడ్డివేస్తే భగ్గున మండడమే కాదు; నీరు జల్లితే నిప్పయి కూర్చొనేది. వాళ్ళిద్దరు నెత్తులు బద్దలుకొట్టుకోకుండా చల్లగా ఉంటేనే ఊరంతా చల్లగా ఉండేది. కాని మరోవిధంగా ఉండదని చాలా మంది గ్రహించారు. గ్రహించి చివరికి వాళ్ళని ఒకాడికి తెచ్చి యిద్దరి మధ్యా రాజీ కుదిర్చారు. ఆ రాజీ షరతులకి కట్టుబడే రక్షకశాఖ వారుకూడా శాంతిభద్రతలని కాపాడుకొంటూ వస్తున్నారు. సదరు రాజీప్రకారం రాజవీధికి తూర్పంతా రామదాసుది. అక్కడతప్ప మరో ప్రాంతంలో ఒక్క చుక్క సారాకూడా అమ్మడానికి అతనికి అధికారంలేదు. పడమట ప్రాంతమంతటా నీలయ్య సారాయే సారాలి.

మొత్తంమీద అందరి చలవవల్లా, ఒడుదుడుకు లేమీ లేకుండా త్రివేణీసంగమంవద్ద సరస్వతీనదిలా ఊరంతా సారా ప్రవహిస్తోంది. ప్రాతఃకాలంలో, సాయంసంధ్యలో, నిశిలో, మోటారుట్యూబులో, మోటారు కార్లలో, బళ్ళలో, సైకిళ్ళలో, పడవల్లో, కూలీభుజాలమీదులలో, ఆడవారి కోకల కిందులో, ఊరంతా అన్ని స్థలాల్లో సారా చకచకా సరఫరా అవుతోంది. కొట్లదగ్గర గళాసులు జోరుజోరుగా ఖాళీ అవుతున్నాయి. బుడ్లకి బుడ్లు కావాలసినవాళ్ళ ఇళ్ళకి జాగ్రత్తగా అందజేయబడుతున్నాయి. తాగే ప్రజకి వంట సారాతో గుండెలుమండి కళ్ళు పేల్తున్నాయి. తాగనివారి సంఖ్య రోజురోజుకి తిరిగి తగ్గిపోతూంది. నిగూఢ గుప్తమైన సారా సొమ్ములో ఎవరి షేర్లు వారికి వెళుతున్నాయి. 'శాంతియుత సహజీవనమే సారాలోక శాంతికి ఏకైక మార్గం' అని తెలుసుకొని, అన్ని పార్టీలవారు కలివిడిగా మెలుగుతున్నారు. మూడు బుడ్లూ, ఆరు గ్లాసులుగా సారా ప్రపంచం అంతా శాంతి–సామరస్యాలతో వర్థిల్లుతోంది.

కాని–ఒకరోజురాత్రి ఒక గ్లాసు పగిలింది.

కొత్త జవానొకడు దాసు కొట్లో ఒక గుక్కెడు నోట్లో పోసుకు ఊసేసి, గ్లాసుని నేలకేసి పగులగొట్టి 'ఇదేటి సారా? కల్లా? కుంకుడుకాయ పుల్లా?' అని కళ్ళెర్రజేసి ప్రశ్నించి, దాసునుంచి, జవాబు వచ్చేలోగా విసవిస నడుస్తూ వెళ్ళిపోయాడు.

"ఎవడాడు?" అని అడిగాడు దాసు.

"నీలయ్యగాడి ముండ నరసాలుందికదా! దాని తమ్ముడు" అని సమాధానం వచ్చింది.

ఉభయ పార్టీల మధ్యా యుద్ధం ఆ విధంగా తిరిగి ప్రారంభ మయింది. అయితే తగవు రాజుకోడానికి కారణం గ్లాసు పగలడం కాదు. కారణం కార్నివాల్ రావడం.

రాచబాటకి తూర్పు దిశగా కార్నివాల్‌ని నెలకొల్పేరు కాంట్రాక్టర్లు. రాత్రివేళ ఆ వైపుకి వెళ్తే దీపాలతో కళ్ళు జిగ్గుమంటాయి; బాకాలతో చెవులు చిల్లులు పడతాయి;

సారాకంపుతో ముక్కు-డొక్కు-లు బద్దలవుతాయి; దగ్గిర డబ్బులుంటే వాటికి కాళ్ళొస్తాయి.

బాకాలూ, దీపాలూ కార్నివాల్ వి. సారాకంపు నీలయ్యది. రాజ్యం రామదాసుది.

తన రాజ్యం విడిచి వెళ్ళిపోవలసిందిగా మర్యాదగా కబురు పంపించేడు నీలయ్యకి రామదాసు. వెళ్ళనన్నాడు నీలయ్య. 'పంచాయతీ అగ్రిమెంటు కాలంలో కార్నివాల్ లేదు. అందుచేత ఈ కార్నివాల్ కి ఆ అగ్రిమెంటు వర్తించదు' - అదీ నీలయ్య వాదన. 'కొట్టు తియ్యను' అదీ అతని జవాబు.

దాసుగారి అనుచరులు కత్తులు నూరుతున్నారని తెలియగానే ఇన్ స్పెక్టరు చిరాకుపడి తలగోక్కు-ని దాసుని రెండురోజులు ఆగమని చెప్పి, నీలయ్యని రమ్మని కబురు పెట్టాడు. 'వాడి జాగాలో నువ్వెందుకు?' అని చివాట్లు పెట్టాడు. 'కాళీ చేసెయ'మని ఉత్తరవు చేశాడు. దక్షిణ అమెరికాలో అమెరికన్ రాయబారి మాటవంటిది ఇన్ స్పెక్టరుగారిమాట. ఆ మాటకి తిరుగంటూ లేదు. వినక పాటించక వీలుపడిందికాదు నీలయ్యకి.

"సరే! ప్రభువులు తమరే అలా అన్యాయం సెలవిస్తే మేమేం చెయ్యగలం!" అని నీలయ్య నిట్టూర్చాడు. 'పైకి మంచిగానే ఉంటూ మనసులో నాగు బాముని దాచుకున్నారు' అని కఠినోక్తులు పలికాడు. అయినా 'సారా అమ్ముకునే దొంగముండ కొడుకులం దొరల్నేం జెయ్యగలం?' అని గొణుక్కొ-ంటూ ఇంటికి పోయాడు.

ఇంటికి పోయి ప్రతికక్షి రాజ్యంలోంచి తన కొట్టు యెత్తించేశాడు. కాని తన చేతులకి గాజులు లేవని తెలియజేశాడు నీలయ్య.

మర్నాడు స్థానిక పత్రికలో ఒక 'ఇనాస్ పెట్టర్ గారి దుచ్చెర్యలను అరికట్టే వారెవరు?' అనే ప్రశ్న ఉదయించింది. కార్నివాలు దగ్గిర కొత్తగా వెలసిన దాసుకొట్టు దగ్గర నుంచి ఇద్దరు తాగుబోతుల్ని తీసుకొచ్చి కేసులు పెట్టించాడు కొత్త జవాను. మర్నాడు మరో ముగ్గుర్ని లాక్కొ-చ్చాడు. దాసుగారి కొట్టుదగ్గర తాగితే ప్రమాదం అని కొంత ప్రచారం సన్నగా లేచింది. కనీసం యాభై గాలన్ల సారాని ఫలానస్థలంలో యెప్పుడైనా పట్టుకోవచ్చునని రహస్యంగా పోలీసులకి వర్తమానం వెళ్ళింది.

కొద్దిరోజుల్లోనే, పదేసి గాలన్ల రౌనుమోటారు లారీ ట్యూబులు ఆరింటితో మూడు రిక్షాలని 'సెంట్రలు పోలీసోళ్ళు పట్టుకుని, రిక్షాలని, డ్రైవర్లనీ 'లోకలోళ్ళకి' అప్పజెప్పి; సరుకునీ, ముద్దాయిలనీ, రిక్షాలనీ చార్జిషీటుతో సహా కోర్టుకి పంపించారు. 'దాసుగోరి సరుకునీ, దాసుగోరి రిచ్చాల్ని' పట్టుకున్నారంటే పట్టుకున్నారని, ఆ నోటా ఆనోట దాసుకు తెలిసింది.

ఆ సాయంకాలం అయిదుగంటలకి కోర్టు వరండాలో తన ప్లీడర్ని పులిలా యెదుర్కొ-న్నాడు రామదాసు. ప్లీడరుగారు హాల్లోంచి అప్పుడే బయటకొచ్చి, గౌనుతీసి మడుస్తూ 'లాభంలేదు' అని తెలియజేశాడు.

"అంటే ఏటి కోర్టువోరి వుద్దేశ్యం?" అని ప్రశ్నించాడు దాసు.

"మూడూ గవర్నమెంటుక్కలిపేస్తాట్ట" అన్నాడు ప్లీడరు గారు

"నా రిచ్చాల్ని గవర్నమెంటుక్కలపడానికి కోర్టేవరు మద్దెని? అందులోనూ, రిచ్చాలిచ్చేస్తాడుగదా అని కేసులొప్పించేసినాంకదా!" అని కేకలు వేసేడు దాసు.

"గట్టిగా అరవకు! నీ రిక్షాలు యిదివరకు రెండుసార్లు సారాతో దొరికిపోయాయి కదా?" అన్నాడు ప్లీడరుగారు.

"దొరికితే మాత్తరం?" అని రెండు చిటికెలువేసి, 'అలాయిడిపించుకొచ్చినాం, అన్నట్టు! అప్పుడు నువ్వే పిటీసనెట్టే ఇడిపించినావు' అన్నాడు దాసు.

"ఆ దొరకడమే కొంప ముంచింది. అది గుర్తుపెట్టుకొని, 'అప్పుడూ వీడివే! చూస్తే రెగ్యులర్ డీలర్‌లా వున్నాడు. వీడికిదే పన్లావుంది!' అంటున్నాడు మేజిస్ట్రేట్. యేంచెయ్యడం?"

"ఏంజెయ్యడవోఁ నువ్వు జెప్పాలా, నానా?"

"పై కోర్టుకు పోవాలి"

"ఎళదాం! దానికేటి? కాని, ఇదిగో ఇను! నా మాటిను" అని ప్లీడరుగారి సమక్షంలో శపథం చేశాడు రామదాసు.

"ఆ దురుమార్గపు లంజికొడుకు? నీలయ్యగాడు! సిప్పలు కడుక్కు బతికేడు. సంబరాల్లో జోబీలుకొట్టి బతికేడు. నాసేత, ఇదిగో ఈ సేత్తోటే, నచ్చాతొంభై సార్లు జెల్లలు తిని బతికేడు. కేడీగాళ్ళమీద పోలీసోల్లకి ఇన్‌పర్ మేసన్లిచ్చి బతికాడు. కోర్టుల్లంట తిరిగితిరిగి, దొంగసాచ్చికా లిచ్చుకొని టీ సుక్కలు తాగిబతికాడు. ముండలకంపినీలో బోకర్ పన్జేసి తిని బతికేడు. అక్కడ ఆ ముండల కోక లెత్తుకుపోయి కానీకి పరక్క అమ్ముకబతికేడు. డబ్బుకోసం పెద్ద రోగపుదాన్ని పెళ్ళి జేసుకొని కక్కుర్తి మానంగ బతికేడు. దాన్సేత కాయితా బ్రాయించేసుకొని దానికి యిసంబెట్టే చంపేసి దాని సొమ్ము తిని కూనీకోర్ బతుకు బతికేడు. సారా అన్జెప్పి ఉప్పు నీళ్ళమ్మి దొంగ బతుకు బతికేడు. బావమర్ది పెళ్ళం-అప్పసెల్లెల్తో సమానం-దాన్ని లెగదీసు కొచ్చి అప్పకి మొగుడుగా-పాపం బతుకు, లుచ్చాబతుకు బతికేడు. కుక్కా బతికింది. ఆడూ బతికేడు. బతికేడు ఫో! కాని నాతో ఇరోదం ఎట్టుకున్నాడు. ఇదుగో, ఇదేమాట సెప్పున్నాను. ఆడు మరింక బతకడు. అణ్ణినానేం సేస్తానని కాదు. నానేం సెయ్యను. నా నాణ్ణే పల్లెత్తు మాటనను. కాని ఆడికింకా తెలకుండా వుంది. నాలో ఈస్పెరుడున్నాడు. ఆ ఈస్పెరుడే అన్ని సేయిస్తాడు. సేయించే పన్లన్నీ నాలో ఈస్పెరుడే సేస్తాడు. అంచేత అదలా ఒగ్గీ! రిచ్చాలగురించి మాత్తరం అయిదరాబాదైనా ఎల్లాలంటే ఎళ్ళు. ఇడిపించుకురా! అందాకా ఇదిగో, ఒంద రూపాయల కాయితం, దగ్గిరుంచు. రిచ్చాలు

మాత్తరం ఇడిపించు" అని శపథంచేసి, పనులు పురమాయించి గృహోన్ముఖుడయాడు రామదాసు.

కోర్టులోవున్న కోపం యింటికి వెళ్ళేసరికి కొంత తగ్గినప్పటికీ దాసుకి ఏ విషయంకూడా సంతృప్తికరంగా లేదు. అరవై గాలన్ల సారాకి గాలొచ్చింది; అమ్మితే, టోకున ఆరువందల రూపాయలు. అదేం సామ్మా? మూడురిక్షాలు లిటిగేషన్లో పడిపోయాయి. డ్రయివర్లు ముగ్గురూ మూడేసి నెలలు జైలుకి పోయారు. జైలుపీరియళ్ళో ఒక్కొక్కరి కుటుంబానికి నెలకి యాభై రూపాయలివ్వాలి. ఇవ్వకుండా ఎగ్గొట్టిన షావుకార్లు లేకపోలేదు. వారిలాంటి షావుకారుకాదు రామదాసు. అందుకనే తన దగ్గర యెప్పుడు ఏ కేసులో జైలుకి వెళ్ళాలంటే ఆ కేసుకి సిద్ధంగా పాతికమంది కత్తుల్లాటి కుర్రాళ్ళున్నారు. అయినా నీలయ్యగాడి వల్ల ముగ్గురు కుర్రాళ్ళు అనవసరంగా జెయిలుకు వెళ్ళేరు.

అయితే కుక్క కాటుకి చెప్పుదెబ్బ ఉండనే వుంది. నీలయ్యగాణ్ని మాపేడం అదేమంత కష్టమైన పనేంకాదు. పోనీ; అదేపోనీ అని దాసు ఊరుకుంటున్నాడంతే? లేకపోతే మూడు నిమిషాల్లో....

దాసుకి దీర్ఘకోపం లేదు. అతను ఇతరుల తప్పుల్ని సులభంగా క్షమించేస్తాడు. ఆ విషయం సభ్య ప్రపంచాని కంతకీ తెలుసు. అతను ఆడంబరంకోసం శపథం చేసేడే కాని, అప్పటికీ - నీలయ్య అంతటితో ఆగిపోతే - నీలయ్యని క్షమించి పారేసును. ఆ నాటికి తొంభై తొమ్మిది తప్పులే చేశాడు నీలయ్య. చేసినవైనా ఇక్కడా, అక్కడా చేశాడు. పరవాలేకపోయింది. కాని నీలయ్య అంతటితో ఆగలేదు.

ఆ రాత్రి నూరో తప్పుకూడా చేశాడు నీలయ్య. ఆ తప్పయినా యిక్కడికీ అక్కడికీ పోకుండా నూకాలమ్మదాకా పోయింది. మరింక దాసు వెనకదీయడానికి వీల్లేదు. 'ఇంజను మరింక ఆగదు' అన్నాడు దాసు.

నూకాలమ్మ దాసుకి పెళ్ళాంకాదు. ఉంపుడుగత్తె అంటారా, ఎంత మాత్రం కాదు. ఆవిడ అతని సహధర్మ చారిణి.

జీవితంలో తొలిసారిగా ఆమెని (అప్పన్న) కొండమెట్లెక్కుతూ కలిశాడు రామదాసు. ఇద్దరూ కలిసి మెట్లన్నీ ఎక్కేరు. కలిసే దేవుణ్ని చూసేరు. కలిసి గుడిబైటికి వచ్చేరు. కలిసి మెట్లన్నీ దిగేరు. అంతటితో అతని మనసుని దోచేసుకుంది. ఆవిడ మనసుని అతను లాగేసుకున్నాడు. మెట్లు దిగీదిగగానే మార్గాన్ని దాసుగారింటికి మార్చేసింది నూకాలమ్మ. అప్పటినుంచీ ఆవిడ మరో మార్గం తొక్కలేదు.

అతను రంగునీళ్ళన్నీ మందునీళ్ళగా అమ్మినరోజుల్లో నీటిలో రంగులన్నీ కలిపి, నీటితో సీసాలన్నీనింపి బిరడాలు బిగించి అన్ని పనులూ నూకాలమ్మే చేసింది. అతను లాటరీబల్ల పట్టుకొని ఊరూరా, సంతసంతలా, పరస పరసలా తిరిగిన రోజుల్లో

బల్లప్రక్కన పుణుకులదుకాణం పెట్టి కొమ్ములు తిరిగిన నాయల్ని లాటరీ బల్లవద్ద కట్టిపడేసిన ఆకర్షణశక్తి నూకాలమ్మదే. నల్లమందుని పీడిత లోకానికి నలుదిక్కులా అందజేయడానికి అతను చేస్తూన్న ప్రయత్నంలో రెండు దిక్కులా సగానికి సగం భారం వహిస్తున్నది నూకాలమ్మకాక ఇంకెవరు? సారా సరఫరాలో, ముండల కంపెనీల మేనేజిమెంటులో, లెక్కలు చూచుకుని రిక్షావాళ్ళనుండి అద్దెలు వసూలు చేయడంలో, రౌడీలను నిలబెట్టి వాళ్ళకి పనులు పురమాయించడంలో, చిన్న కారు జవాన్లని అదుపులో వుంచడంలో, పెద్దలకు మూతులు కట్టడంలో, డబ్బు దాచడంలో, అది మూలకుండా వడ్డీలతో దాన్ని పెంచడంలో, అన్ని పనుల్లోకూడా శాస్త్రకారుడు ఉగ్గడించిన ప్రకారం సర్వవిధాలా దాసుగారి ధర్మానికి బాణంలా సరిపడుతూన్న సద్గుణాల ఖని, ఆ సర్వాంగసుందరి, ఎవరామె? ఆమె నూకాలమ్మ.

కోర్టునుంచి వచ్చిననాటి రాత్రి ఒంటిగంటకి మేడమీదిగదిలో పందిరి మంచం మీద పడుకున్న దాసుని నిద్రలేపేరు. 'ఏట్రా? లంజకొడకా' అని లేపినవారిని బూతులు తిడుతూ లేచేడతను. చూస్తే ఎదర నూకాలమ్మ. ద్రౌపదిలా నిల్చొంది. కట్టుకున్న నైలాన్ కోకంతా పేలికలై పోయింది. తొడుకున్న జాకెట్టుకూడా అక్కడక్కడ చిరిగింది. కొప్పంతా విడిపోయి జుట్టంతా రేగింది. సగం తెగిన పూలదండ తల చిక్కులోంచి వేలాడుతోంది. కళ్ళు భగభగ మండుతున్నాయి.

"ఏటయింది?"

"కార్నివాల్ కి వెల్తె దీపాలార్పేసి అల్లరి చేసేరు!"

"ఎవరు?"

"నీలయ్య మనుసులు."

బస్! అంతే! 'ఇంజను మరింక ఆగదు' అన్నాడు దాసు.

ఆ రాత్రి ఒంటిగంటకి ఆ గదిలో సభ జరిగింది. రాజుగారు పందిరి మంచం మీద కూర్చున్నారు. పట్టమహిషి ప్రక్కనే వుంది. ఇద్దరు మంత్రులూ హాజర్లో వున్నారు. సేనానాయకుడు చేతులు కట్టుకు నిల్చున్నాడు. ఆంతరంగిక కార్యదర్శికి అర్జంటు వర్తమానం వెళ్ళింది. ముగ్గురు ముఖ్యమైన అమెరికన్ నావికోద్యోగుల్ని 'లాడ్జింగ్ హవుస్' నడవలో ఎక్కడున్నవాళ్ళని అక్కడే విడిచిపెట్టేసి అతను మనో వేగంతో వచ్చివాలేడు.

సభలో సమస్యని అంతా కలిసి చర్చించడం, ఒక నిర్ణయానికి రావడం జరిగింది. నిర్ణయం గురించి వారిలో అభిప్రాయ భేదాలేవీ లేవు. నిర్ణయాన్ని ఎప్పుడు, ఏ రోజున అమలుపరచాలన్నదే ప్రశ్న.

శుక్రవారంనాడు శివరాత్రి.

"ఆ రోజున కూడదు" అన్నాడు దాసు.

దాసుకి దైవభక్తి హెచ్చనే విషయం గుళ్ళో ప్రతి పూజారికేకాదు, ప్రజ యావన్మందికీ తెలుసు. అతడు యెప్పుడు కావలిస్తే అప్పుడు కైలాసానికి వెళ్ళి తిరగలడు. అందులో సందేహంలేదు. నీలయ్యగాడు మాత్రం అక్కడికి వెయ్యిజన్మలెత్తినా వెళ్ళకూడదు.

"ఆ రోజు కూడదంటావేమిటి! అదే సుభువైనరోజు" అని కార్యదర్శి మొత్తుకున్నాడు, లాభంలేకపోయింది.

నీలయ్యగాణ్ని, ఆణ్ని సస్తే కైలాసానికి ఎళ్ళనియ్యను అని భీష్మించుకు కూర్చున్నాడు దాసు. లాగినకొద్దీ బిగిసేదేకాని సడిలేదు కాడు.

"సరైతే నీ యిష్టం" అన్నాడు కార్యదర్శి.

శుక్రవారం పవిత్రదినం-ఆరోజున వెళ్ళేవారికి కైలాసద్వారం బారున తెరచుకుంటుంది. అంచేత ఆ దినం విడిచిపెట్టేసి, ఆ మర్నాడు శనివారం రాత్రికి ఏం చెయ్యాలో, ఎవరు చెయ్యాలో, ఎక్కడ ఎలా చెయ్యాలో అంతా సెటిలయింది. అంతలో భళ్ళున తెల్లవారింది. ఎవరి మట్టున వారు హాయిగా, నిశ్చింతగా నిద్రబోయేరు.

ఆంతరంగిక కార్యదర్శి, పూర్వాశ్రమంలో ఒక పేరుమోసిన ప్లీడరుగారి గుమస్తాకింద గుమస్తా. అతను ఒక్కసారే తప్పుచేసి దొరికిపోయాడు. ఆ తప్పయినా వేరొకరి కోసం, వారు చేయించడంవల్ల చేసేడు. ఆ పాపాన్ని సెంట్రల్ జెయిల్లో కడిగేసుకున్నాడు. 'పైకొచ్చేక ప్లీడర్నిగాని, ప్లీడరు గుమాస్తానిగాని ఇకమీదట తాకితే....' అని ఓ ఘోరమైన ఒట్టు పెట్టుకున్నాడు. జెయిల్లో వుండగానే అక్కడ దాసుగారి శిష్యపరమాణువు నొకణ్ని కలుసుకొని, వారివల్ల దాసుగారి కీర్తి ప్రతిష్టలు విన్నాడు. బైటపడ్డాక దాసుతో పరిచయం సంపాదించి, అతణ్ని ఆపాదమస్తకం పరీక్షించి చూసి, 'పెంచితే ఇలాంటివాణ్ని పెంచాలి' అనుకున్నాడు. పెంచుదామనే నిశ్చయానికి వచ్చేసేడు.

దాసు బలంలో నూకాలమ్మది సగమైతే, దాసుదొక పావైతే, మిగతా పావూ కార్యదర్శిది. దాసుకి రావలసిన నల్లమందు, రెక్కలు తెచ్చుకుని ఆకాశయానంచేసి మరీకిందికి దిగిందంటే-దానికి కార్యదర్శి ప్రతిభే కారణం. 'సారా సప్లయి' ఎవడయినా చేస్తాడు. పెద్దలకి హార్బర్లోంచి విస్కీబుడ్లు వెళ్ళాలన్నా, షిప్పుల్లోంచి వారికేసామాను పంపించాలన్నా ఆ పనులు కార్యదర్శి మాత్రం చేయాలి. ఇంగ్లీషులో అతనే మాట్లాడాలి. కోర్టుపనులు (ప్లీడర్లనీ, గుమాస్తాల్నీ తాకకుండా) అన్నీ అతనే చూడాలి. లాడ్జింగుహవుసు అతని మేనేజిమెంటులోనే వుండాలి. మొత్తంమీద సంస్కృతీ విజ్ఞానాలు అతని సొమ్ము. శకుని, శుక్రాచార్యులు, గోరింగ్, గోబెల్సు, హేమర్ షెల్డు కోవలోనివాడు దాసుగారి ఆంతరంగిక కార్యదర్శి.

కార్నివాల్లో గలాటా జరగడం సోమవారం జరిగింది. శనివారం రావాలంటే, మంగళ, బుధ, లక్ష్మి-ఇలా ఎన్నో వారాలు వెళ్ళాలి. కార్లో ఆఫీసునుంచి క్లబ్బుకి వెళ్ళినట్టుగా ఈ రోజునుంచి ఆ రోజుకి వెళ్ళిపోవడం కష్టం. అలా వీలుపడనేపడదసలిది.

ఈ లోగా రోజుకి ఇరవైనాలుగు గంటలపాటు-దాసు రక్తం కుతకుతలాడుతోంది. నూకాలమ్మ ఆరని నిప్పుసెగలా వుంది. ఆవిడ ఆ నైలాన్ చీర విడవలేదు. కొప్పు ముడవలేదు.

ఎలాగైతేనేం శివరాత్రి వచ్చింది.

"ఇంకొక్కరోజు! ఇయాల్టికి కాస్తలెగిసి ఫలారం భోంచెయ్!" అన్నాడు నూకాలమ్మతో దాసు.

నూకాలమ్మ మంచంమీంచి లేచింది. కాని ఉపవాస దీక్ష విడవలేదు.

"నువ్వూ ఉపాసం వుండు" అంది దాసుని.

"ఇయాళ సారా ముడతానా?!!" అని ముక్కుమీద వేలేసుకున్నాడు దాసు.

శివరాత్రి

రాత్రి దాసూ అతని రాణీ, అతని ఇద్దరు మంత్రులూ కూర్చొని పేకాడుతున్నారు.

రాత్రి పన్నెండుగంటలు ఠంగు ఠంగుమని కొట్టి రెండు నిముషాలయింది. లెంపలు వేసుకొన్నాక డిప్యూటీ మంత్రి కళావర్ జాకీని కిందికి విసిరాడు.

"చక్కగా అలా నోరుమూసుకు ఆడు" అంది నూకాలమ్మ.

"లేకపోతే రేపు దగ్గరుండి మరీ కొట్లో వేయించేస్తాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"ఆడి ముక్కని నా నిస్పేటాసేసి కోసేను. నువ్వేటేస్తావో ఎయ్" అని పెద్దమంత్రిని కసిరేడు దాసు.

"కోసేవూ? అయితే ఏడు పట్టుకుపో" అన్నాడతను కళావరేడు ముక్క పడేస్తూ.

"మన సెక్రెటీ అవుపించదు" అన్నాడు డిప్యూటీ.

"ఆటాడక ఆడిసంగతి నీ కెందుకురా?" అని చీవాట్లు తిన్నాడు.

"నీలా కాళ్ళుసాచుకూక్కుడుంటె పన్లయినట్టే! మొగోడికి నిద్దరా, బద్ధకం ఉండకూడదు. దరిద్దరం!" అంది నూకాలమ్మ.

గదిలో పైన పంకా విరామం లేకుండా తిరుగుతోంది. ట్యూబులైట్లు-నాలుగ్గోడలానాలుగూ, మధ్యనొకటీ-పోటీపడి వెలుగుతున్నాయి. గోడనొక నిలువుటద్దం నీటిలా మెరుస్తోంది. దుస్తులు సరిగాలేక అందమైన యువతీమణులు బొమ్మలు బొమ్మలుగా గోడల్ని వేళ్ళాడుతున్నారు.

కలిపినప్పుడు పేకముక్కలు సరసర మంటున్నాయి. డబ్బులమీద డబ్బులు పడ్డప్పుడు డబ్బు చప్పుడు ఆడదాని మట్టెల చప్పుళ్ళా హాయిగా వుంటోంది. సారా వాసనతో మిళితమైన పొగాకు సువాసన, పంకా విసురుకి గదంతా చెదురుతోంది.

అంతలోనే గడియారం ఒంటిగంట కొట్టింది.

"దరిద్రం ఒదిలిపోయింది" అంటూ గదిలోకి వచ్చేడు అంతరంగిక కార్యదర్శి.

"ఇదుగో! చెక్రెట్రే" అని అంత ముఖం చేసుకున్నాడు డిప్యూటీ.

"దరిద్దరం మనకసలుందేటి" అని అడిగింది నూకాలమ్మ.

"మన సంగతికాదు చెప్పింది" అంటూ గుమ్మంలోంచి గదిలోకి నడిచేడు సెక్రటరీ.

అతని లాల్చీ సిల్కుది. పంచె మల్లుది. సిగరెట్టు నోట్లోది. ఫారిన్ సిగరెట్టిన్ను చేతిలోది. అతని వయస్సు చిన్నది. కన్ను పెద్దది. తొక్క తెల్లనిది. చూపు మాయని దాచినది.

గదిలోకివచ్చి ఒక వారనున్న వాలుకుర్చీలో కూర్చుంటూ 'వాడి దరిద్రం ఒదిలిపోయింది' అని సిగరెట్ పొగని నోటివారంట వదిలేడు.

"ఎవుడి దరిద్దరం?" అన్నాడు డిప్టీ.

"నీలయ్యగాడిది" అన్నాడు సెక్రటరీ.

ముక్కవేయబోతూ ఎలా ఉన్నవాడలా ఉండిపోయేడు దాసు.

"ఏటిగురూ?! ఏటయింది?" అన్నాడు.

"నీలయ్యగాడు ఠా!"

అని నోట్లోంచి ఈసారి సిగరెట్టు పైకి తీసి పొగను మనోహరంగా ఊదేడు సెక్రటరీ....పంకా దూరంగా ఉన్నందువల్ల ఆ పొగ పైకిలేచి కొమ్మలు చిమ్ముకొని గాలికి చెట్టూగినట్లు ఊగింది. మబ్బు విడినట్లు విడింది.

సెక్రటరీ తెచ్చినవార్త వినగానే తివాసీమీద కూర్చున్న ఆడమనిషి నెమ్మదిగాలేచి పందిరిమంచంమీద మెత్తని పరుపుమీద కూర్చుని నిదానంగా కొప్పుముడుచుకుంది. మగవాళ్ళు ముగ్గురూ చేతుల్లో ముక్కలు తివాసీ మీదికి విసిరేసి, వాలుకుర్చీ దగ్గిరకొచ్చి నిల్చున్నారు. నిల్చొని ప్రశ్నలు కురిపించేరు.

సిగరెట్టు నుసి కిందకికొట్టి 'ఆగండి చెప్తా?' అన్నాడు కార్యదర్శి.

"సెప్పు"

"బేగి చెప్పు"

"వేగిరం చెప్పు"

అన్నారు ముగ్గురూను.

"వినండి"

"ఊరిచివర లాడ్జింగ్ హవుస్‌లో నిన్ననొక కొత్తదొరసాని చిలక దిగింది. ఎవరు దింపేరో ఎవరికి తెలుసు? దిగడం మాత్రం దిగింది; తెల్ల దొరసానికాదు. అలాగైతే

ఈజీగా పట్టేస్తామన్నారు పోలీసువాళ్ళు; నల్ల దొరసాని. అయితేనేం? అందంగా నాటకాల్లో, సినీమాల్లో యాక్ట్రెస్‌లా ఉందట. దొరసానంటే నీలయ్యగాడు కుక్కే కదూ! సంగతి కనుక్కోని ఇవాళ మధ్యాహ్నం పన్నెండుగంటలకి గదిలోదూరి తలుపులు బిడాయించేసుకున్నాట్ట. రాత్రి పదకొండుకి తలుపు తెరిచుంది. చూస్తే నల్లదొరసాని స్టేజీమీదలేదు. నీలయ్యగాడు మాత్రం గదినిండా దున్నపోతులా చచ్చిపడున్నాడు. చావడానికి ఎన్ని విస్కీబుడ్లుండాలో అందుకు సరిపడ గదిలో అన్నిఖాళీ బుడ్లున్నాయి. తెగతాగి తెగతాగి గుడ్లు పేలేయి, గుండె పగిలిందంటున్నారు పోలీసువాళ్ళు. మరైతే చిలక గైరుహాజరెందుకవాలి? మనిషి చావగానే భయపడి పరారీ అయుంటుంది. అంతేకాని ఇది ఖూనీ కాదంటున్నారు పోలీసువాళ్ళు."

"చిలక దొరకదా?" అని అడిగేడు ముఖ్యమంత్రి.

జవాబుగా, కనురెప్పలు నెమ్మదిగా దించి వాటిని బరువుగా పైకెత్తి, అమాయకంగా చూశాడు ఆంతరంగిక కార్యదర్శి.

"అయితే మనకి పన్లేకుండా జరిగిపోయింది" అన్నాడు ముఖ్యమంత్రి చిరునవ్వు నవ్వుతూ.

గదిమధ్య నిల్చుండిపోయాడు రామదాసు. అతనికంతా ఆశ్చర్యంగా వుంది. ఏదో బోధపడకుండా ఉన్నట్టుగా ఉంది. గదిలో నలుగురి ముఖాలు వరసగా చూసేడు. నాలుగు గోడల్నీ చూసేడు; నూకాలమ్మ ముఖంలోకి చూసేడు. పూచికపుల్లంతయినా శ్రమపడనవసరం లేకుండా పని జరిగి పోయింది. కాని అతని మనసునేదో బాధిస్తూంది. నీలయ్యగాడు చస్తే లాటరీలో లక్షరూపాయిలొచ్చినట్టుగా ఉండవలసివుంది. కాని అలా లేదు. లాటరీలో లక్షరూపాయిలొచ్చిననాడు ఇంట్లో ఎవరో పోయినట్టుగా వుంది. వాడు-నీలయ్యగాడు-చావడం బాగానే వుంది కాని, వాడలా చావడం బాగులేదు.

"అంతా ఆ పరమేశ్వరుడి లీల" అన్నాడు రెండో మంత్రి అంతలో.

"జయం" అన్నాడు ముఖ్యుడు.

"అందులోనూ ఇయాళ చివరాత్తిరి" అన్నాడు ద్వితీయుడు.

"శివరాత్రినాడు చస్తే...." అని నాలిక్కొరచుకొని ఆగిపోయాడు ముఖ్యమంత్రి. ఆవేళ ఆపాటికప్పుడే నీలయ్యగాడు కైలాసపు సింహద్వారం దాటి లోనికి పోయుంటాడని అతనికి గుర్తుకొచ్చింది. నాలిక కరుచుకొని ఆగిపోయి దాసుముఖం చూసేడు.

దాసు ముఖం జేవురించి వుంది. ఇందాకా బోధపడని విషయం బోధపడ్డంతో అతని కళ్ళు అకస్మాత్తుగా రౌద్రంతో నిండిపోయేయి. అతనికి కోపంవల్ల మాట సరిగా వచ్చింది కాదు.

"మరైతే ఆడు....ఆడు....ఆ లంజికొడుకు, ఆ నీలయ్యగాడు! ఆడి పాపాలన్నీ

ఏకైనట్టు?" అని గావుకేకవేసి ప్రశ్నించేడు రామదాసు.

ఆ ప్రశ్నకి సమాధానం రాలేదు. సెక్రటరీ తివాసీవైపూ, నూకాలమ్మ పంకావైపూ, మంత్రులిద్దరూ ఒకరి ముఖంలో కొకరు చూస్తూ ఉండిపోయారు.

విశాలాంధ్ర దినపత్రిక. 2-4-1961.